## అందరూ వరంగల్ సభకు తరలి రావాలి



విజయేందర్‌సాగర్

అంబర్‌పేట, ఏప్రిల్ 25 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ సభకు ప్రజలందరూ తరలిరావాలని శెన్‌శెట్టి విజయేందర్ సాగర్ అన్నారు. శుక్రవారం నల్లకుంటలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోసపోయిన ప్రతి ఒక్కరూ ఈ సభకు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. నల్లకుంట డివిజన్ నుంచి భారీ ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు తరలివస్తున్నారని చెప్పారు. మొదట డివిజన్‌లోని ప్రధాన చౌరస్తాలతో పాటు బస్తీలలో పార్టీ జెండాలను ఎగురవేస్తామన్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ నేతృత్వంలో మహిళలు, యువత కూడా పెద్ద సంఖ్యలో బహిరంగ సభకు వస్తున్నారన్నారు. వారికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## హవాలా డబ్బు రూ.8 లక్షలు పట్టివేత



హవాలా డబ్బుతో నిందితుడు మహ్మద్ అఖిల్

మెహిదీపట్నం, ఏప్రిల్ 25: నగరంలో హవాలాతో డబ్బులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని మాసబ్ ట్యాంక్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ.8 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పరుశురామ్ తెలిపిన వివరాల ప్రకారం... మాసబ్ ట్యాంక్ ఏసీ గార్డ్స్‌లో నివసించే మహ్మద్ అఖిల్(34), మేకల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. ఇతడు దుబాయ్‌కి చెందిన అబ్బు అనే వ్యక్తి సూచనలతో హవాలా డబ్బును నగరంలో చలామణి చేస్తున్నాడు. శుక్రవారం మాసబ్ ట్యాంక్ ఏసీ గార్డ్స్ ప్రాంతంలో 8 లక్షలు తీసుకెళ్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. డబ్బులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. డబ్బులను ఆదాయ శాఖ అధికారు

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

అంబర్‌పేట, ఏప్రిల్ 25 : కరెంట్‌లైన్లలో మరమ్మతుల కారణంగా ఈ నెల 26వ తేదీన అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సీబీడీ, ఏడీఈ జి.నాగేశ్వర్‌రావు తెలిపారు.

**ఉదయం 8.30 నుంచి10 గంటల వరకు..**

తిలక్‌నగర్ ఫీడర్‌పై తుప్పు పట్టిన వంపు స్తంభం విరిగిపోవడంతో దాన్ని మార్చడం కోసం తిలక్‌నగర్ ప్రధాన రహదారి, గోల్నాక చుట్టుపక్కల ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.


**ఉదయం 8 నుంచి 8.30 వరకు..**

11కేవీ ఛే నంబర్ పీడర్ పరిధిలోని గోల్నాక చర్చి, అశోక్ నగర్, తిలక్‌నగర్, ఛే నంబర్, కూరగాయల మార్కెట్, చుట్టుపక్కల ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

**9.30 నుంచి 10గంటల వరకు..**

11కేవీ బసంత్ కాలనీ ఫీడర్ పరిధిలోని బసంత్ కాలనీ, లింగంపల్లి, వైశ్య హాస్టల్, జైన్ మందిర్, కాచిగూడ క్రాస్ రోడ్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

# రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం



రజతోత్సవ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిసుస్తన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

మెహిదీపట్నం, ఏప్రిల్ 25 : తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మొహ్మద్ అలీ, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, పార్టీ సీనియర్ నాయకులు అజీమ్ చేతుల మీదుగా నాంపల్లి నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జ్ సీహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్ రజతోత్సవ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పడి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా రజతోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు కార్వాన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కే శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ నాయకులు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రజతోత్సవమాసభకు తరలి వెళ్లడానికి చేస్తున్న సన్నాహాల గురించి చర్చించారు.

**జియాగూడ** : రజతోత్సవ సభను పురస్కరించుకొని శుక్రవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి జియాగూడ డివిజన్‌లో బీఆర్‌ఎస్‌పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు కే శేఖరరెడ్డి,శ్రీధర్‌సాగర్ మాట్లాడుతూ... ఈ నెల 27 న వరంగల్ లోని ఎల్కతుర్తి లో జరిగే భారీ బహిరంగ సభకు ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యాద శ్రీనివాస్‌గుప్తా, శ్రీధర్‌సాగర్ డివిజన్, అధ్యక్షుడు నరహరి చారి, సి. బాబు, ఎం.కిశోర్ కుమార్, జడల మోహన్, రఘునాథ్, మహిళా నాయకురాలు అనిత, ప్రకాశ్, పాలెం వెంకటేశ్ నరసింహులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాలు దెబ్బతిన్నాయి..**

**కాచిగూడ** : కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాలు దెబ్బ తిన్నాయని బీఆర్‌ఎస్ నాయకుడు బబ్లూసింగ్ అన్నారు. శుక్రవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27న వరంగల్ జిల్లా ఏలకతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

**రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలి..**

గోల్నాక, ఏప్రిల్ 25: వరంగల్ జిల్లాలో రేపు ఆదివారం నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు అంబర్ పేట డివిజన్ నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పటేల్ నగర్ లోని బీఆర్‌ఎస్ కార్యాయంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి కానుందన్నారు. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ సాధించి రాష్ట్రాన్ని దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని చెప్పారు. రాష్ట్ర ప్రజల చూపు కేసీఆర్ వైపు ఉందని, రాను న్న రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ప్రతి ఒక్క కార్యకర్త వారి ఇంటిపై బీఆర్‌ఎస్ పార్టీ జెండాలను ఎగురవేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జాఫర్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పటేల్‌నగర్ కార్యాయలంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్



శేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు బబ్లూసింగ్ తదితరులు

## పహల్గాం ఉగ్రదాడి మృతులకు నివాళి



కాశ్మీర్ ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్

గోల్నాక, ఏప్రిల్ 25 : జమ్మూ కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులకు బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం అంబర్ పేట్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ ఆధ్వర్యంలో పటేల్‌నగర్‌లో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ హాజరై ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు.

అదేవిధంగా గోల్నాక కార్పొరేటర్ తన క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జమ్మూకాశ్మీర్ ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు బీఆర్‌ఎస్ నేత దూసరి శ్రీనివాస్‌గౌడ్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లింగంగౌడ్, నర్సింగ్‌యాదవ్, మల్లేశ్‌గౌడ్, శివరామకృష్ణ, లక్ష్మణ్‌గౌడ్, మహేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అమాయకులను చంపిన ఉగ్రవాదులను ఉరితీయాలి



ఉగ్రవాదులను ఉరితీయాలని కాచిగూడలో నిరసన చేస్తున్న వినోద్‌యాదవ్ తదితరులు

కాచిగూడ, ఏప్రిల్ 25: జమ్మూకాశ్మీర్‌లో అమాయకుల ప్రాణాలను హరించిన ఉగ్రవాదులను బహిరంగంగా ఉరితీయాలని ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి. వినోద్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఉగ్రవాదులను ఉరితీయాలని కాచిగూడలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశం అభివృద్ధి చెందుతుంటే పోరుగు దేశాలు తట్టుకోలేకపోతున్నాయని పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు దేశమంతా అండగా ఉంటుంద అన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉగ్రదాడి పిరికిపంద చర్య



జమ్మూకాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి పిరికి పంద చర్య అని నాంపల్లి ఎమ్మెల్యే మజీద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం మెహిదీపట్నం విజయనగర్ కాలనీలో ఉగ్రదాడిలో మరణించిన వారి మృతికి సంతాపంగా క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ తో పాటు, నాయకులు డాక్టర్ షేక్ ఖాసీం, జాఫర్ ఖాన్ పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, ఏప్రిల్ 25

## కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలి



ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం అందజేసిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు

కాచిగూడ, ఏప్రిల్ 25: తెలంగాణలోని నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథి ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ విజ్ఞప్తి చేశారు. కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ.. శుక్రవారం ఎమ్మెల్సీ కోదండరాం ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుజ్జ కృష్ణ మాట్లాడుతూ తెలంగాణలో రాష్ట్రంలో వేలాది మంది కళాకారులు ఉపాధి లేక రోడ్డున పడుతున్నారని, ఆ కళాకారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొని ఉద్యోగాలు కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమం ఉదయ్ నేత తదితరులు పాల్గొన్నారు.

## ఆలోచనను పెంచే విధంగా ఎగ్జిబిషన్లు ఉండాలి



ఆహ్లాదాన్ని పంచడంతోపాటు ఆలోచింపజేసే విధంగా ఎగ్జిబిషన్లు ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే మమ్మద్ కౌసర్ మోయినుద్దీన్ అన్నారు. వేసవికాలంలో విద్యార్థులకు ఆలోచన శక్తిని పెంచే విధంగా ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. లంగర్ హౌస్‌లోని బాపుఘాట్ సమీపంలో ఏర్పాటు చేసిన ఇన్ఫాంట్ హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్ లండన్ సిటీ థీమ్ ఎగ్జిబిషన్‌ను కార్పొరేటర్ నసీరుద్దీన్, నిర్వాహకులు రాబ్బన్ కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.

– మెహిదీపట్నం, ఏప్రిల్ 25

## హజ్ యాత్రికులు అప్రమత్తంగా ఉండాలి



హజ్ యాత్రికులకు సూచనలు చేస్తున్న గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

మెహిదీపట్నం, ఏప్రిల్ 25: హజ్‌కువెళ్లే యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శుక్రవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో హజ్ యాత్రికులకు ఉచిత వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావుతో కలిసి ఏసీపీ ప్రారంభించారు. హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేయాలని అన్నారు.

## ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ ప్రీ పీహెచ్‌డీ (పీహెచ్‌డీ కోర్స్ వర్క్) పరీక్షలను వాయిదా వేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఈ పరీక్షలను ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించినప్పటికీ, వివిధ సాంకేతిక కారణాల రీత్యా దానిని వాయిదా వేసుకున్నట్లు వివరించారు. పరీక్షలను తిరిగి నిర్వహించబోయే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## లాంగ్వేజెస్ కోర్సుల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపరుకు రూ.10,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## పోస్ట్ ఎంఎస్సీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పోస్ట్ ఎంఎస్సీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అండగా నిలుస్తాం




పహల్గామ్‌లో అమాయక పౌరులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ హైదరాబాద్‌లోని కోఠి బ్యాంకు స్ట్రీట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

అబిడ్స్/ సుల్తాన్ బజార్, ఏప్రిల్ 25. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో దేశానికి అండగా నిలుస్తామని ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి.ఎస్. రాంబాబు తెలిపారు. పహల్గామ్‌లో జరిగిన క్రూరమైన ఉగ్రవాద దాడి బ్యాంకు ఉద్యోగులను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఈ భయంకరమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. పహల్గామ్‌లో అమాయక పౌరులపై ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ హైదరాబాద్, కోఠి, బ్యాంకు స్ట్రీట్ లో శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్ అండ్ తెలంగాణ బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ నిరసన ప్రదర్శన నిర్వహించింది. వందలాదిమంది బ్యాంకు ఉద్యోగులు ప్లకార్డులు చేతబూని ఉగ్రవాదం నశించాలి, శాంతిని కాపాడాలి, ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేసి, కొవ్వొత్తులు వెలిగించి ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బి.ఎస్. రాంబాబు పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడి బ్యాంకింగ్ వర్గాలకు తీవ్ర దుఃఖంతోపాటు కోపాన్ని కలిగించిందని అన్నారు. ఈ విషాదకరమైన ఉగ్రవాద దాడిలో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు జె. చంద్ర మౌళి, శైలేష్ భాయ్ కాలాతియా బలికావడం బ్యాంకు ఉద్యోగులను తీవ్రంగా కలచివేసిందని అయన ఆవేదన వ్యక్తం చేసారు. ఈ దాడిని నాగరిక సమాజంపై ఒక మచ్చగా అభివర్ణిస్తూ, బాధ్యులను త్వరగా పట్టుకొని కఠినంగా శిక్షించాలని అయన కోరారు. శాంతి, ఐక్యత మరియు పురోగతి కోసం ప్రయత్నిస్తున్న సమాజంలో ఇటువంటి ఉగ్రవాద చర్యలకు స్థానం లేదని అయన నొక్కి చెప్పారు. అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం గట్టిగ ప్రయత్నించాలని, బ్యాంకు ఉద్యోగులుగా కేంద్ర ప్రభుత్వానికి సంఘీభావంగా ఉంటామని, ఎల్లప్పుడూ శాంతి కోసం నిలబడతామని బి.ఎస్. రాంబాబు తెలిపారు. ఈ ప్రదర్శనలో ఆంధ్ర ప్రదేశ్ అండ్ తెలంగాణ బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు టి. రవీంద్రనాథ్, సంయుక్త కార్యదర్శి పి.వి. కృష్ణ రావు, ఉప ప్రధాన కార్యదర్శులు సమద్ ఖాన్, ఉదయ్ భాస్కర్, అజయ్ కుమార్, ఏఐబీఓఏ ప్రధాన కార్యదర్శి ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యభిచార గృహం పై దాడి.. నలుగురి అరెస్ట్



పోలీసుల అదుపులో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఉగండా దేశస్తులు

చార్మినార్, ఏప్రిల్ 25 : ఉన్నత విద్యాభ్యాసం కోసం నగరానికి వచ్చిన విదేశీయులు గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఉగాండ దేశానికి చెందిన నయేబరే డోరీన్ (42) నగరంలోని విజయపురి కాలనీ లాలాగూడలో నివసిస్తున్నాడు. అతనితోపాటు ఇంగ్లిష్ లో పీహెచ్‌డీ చేయడానికి వచ్చిన అడమా బా (36) స్నే నాస్, ఆదామా బాహ్ లు నాయెబారే డోరిన్ తో కలిసి నివసిస్తున్నారు. విద్యాభ్యాసం పేరుతో నగరంలో నివసిస్తూ గుట్టుచప్పుడు కాకుండా స్థానికంగా వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నారు. విటులకు వాట్సాప్ ద్వారా ఫొటోలను షేర్ చేస్తూ ఆకర్శించేవారు. ఎల్‌బీనగర్ ప్రాంతానికి చెందిన సందీప్ వ్యభిచార గృహాన్ని నడుపుతున్న నిందితులు పంపిన ఫొటోలను చూసి ఆకర్షితుడై ఉగండా దేశానికి చెందిన నిందితులు నివసిస్తున్న విజయపురి కాలనీకి వెళ్లాడు. విశ్వాసనీయ సమాచారం అందుకున్న నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. నిర్వాహకులతోపాటు విటుడు సందీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను లాలగూడ పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్ ఐ లు శ్రీనివాసులు దాసు, జ్ఞానదీప్, సి.రాఘవేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## మైనర్ల డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్



వాహనం నడుపుతూ పట్టుబడిన మైనర్‌కు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య

మెహిదీపట్నం, ఏప్రిల్ 25 : ట్రాఫిక్ నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని లంగర్ హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అన్నారు. శుక్రవారం లంగర్ హౌస్‌రింగ్‌రోడ్డు ప్రాంతంలో మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టు కుని వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనం రిజిస్ట్రేషన్‌ను ఒక సంవత్సరం పాటు రద్దు చేస్తామని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ అంజయ్య తెలిపారు.

## ఇసామియా బజార్ ఆరె కటిక సంఘ్ పేరు వాడుకుంటే చట్టరీత్యా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ్ అధ్యక్షుడు రమేశ్‌కుమార్, ప్రతినిధులు

కాచిగూడ, ఏప్రిల్ 25: 2001 సంవత్సరంలో స్థాపించిన ఆరె కటిక సంఘ్ ఇసామియా బజార్ పేరుతో కోకాపేటలోని ఆరెకటిక ట్రస్ట్ సభ్యులు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఇటీవల ప్రకటించారని, అలాంటి వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆరెకటిక సంఘ్ ఇసామియా బజార్ అధ్యక్షుడు హెచ్.రమేశ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడ ఆరెకటిక భవన్‌లో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోకాపేటలోని ఆరెకటిగా ట్రస్ట్ సంఘానికి అరె కటిక సంఘ్ ఇసామియా బజార్ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని, మా అనుమతి లేకుండానే ఆరెకటిక సంఘ్ ఇసామియాబజార్ రిజిస్టర్ నంబర్ 6233/2001 ప్రచురించి, వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఆ సంఘానికి మా సంఘానికి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. అలాంటి వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రకాశ్, సాయిసచితానంద్, బి.శంకర్, శ్యామ్ సుందర్, సతీశ్, రఘునాథ్, జ్ఞానేందర్, రాజు, హరినారాయణ, రామ్మోహన్ పాల్గొన్నారు.